# పాలపొంగు

— వి. ఆర్. చక్రవర్తి

బావ భోజనం జేసి పండు వెన్నెలలో షికారుగా బయటికి వెళ్ళాడు. అక్కయ్య నేను వడ్డించుకొని కూర్చుందామనుకుంటుండగనే. అక్కయ్య బయట చేరటంతో దానికి కావలసిన సరంజామా అంతా యిచ్చి భోంచేసి యిల్లు వగయిరా శుభ్రము చేసుకొనేటప్పటికి బాగా ప్రొద్దుపోయింది. ఇక ఆ మూడు రోజుల గృహనిర్వహణ బాధ్యతంతా నా పాలబడింది.

అక్కయ్య బాబునెత్తుకొని యేనాటి లోపలి పరిస్థితంతా చూడటానికి వచ్చి "కమలను నాతో పంపించమన్నా! ఒక పది రోజులుండి వస్తుంది. నాకూ కొంచెం హాయిగా వుంటుంది" అని అడిగినప్పుడు మొదట నాన్న "ససేమిరా" ఒప్పుకొనలేదు.

"కాపురానికి వెళ్ళవలసిన పిల్ల, దాన్నిప్పుడు పరాయి యిళ్ళకు పంపిస్తే ఉన్నగొడవకుతోడు మరి యింకొకటి తయారవుతుందేమో నమ్మా" అంటూ మొదట నాన్న సందేహించాడు. అక్కయ్య తిరిగి అడిగినమీదట, అమ్మ చెప్పగా చివరకు ఒప్పుకొన్నాడు. కొంత వాతావరణమయినా మారుతుంది గదా! నాలుగురోజులు సరదాగా గడిపి రావచ్చని అక్కయ్యతో ప్రయాణానికి నేనూ సమ్మతించాను.

రెండు సంవత్సరాలనుండి నే కాపురానికి పోయే సమస్య వియ్యాలవారికి నాన్నకు మధ్య నలుగుచునే యున్నది.

పెళ్ళినాడిస్తామని వాగ్దానము జేసిన టెలివిజన్ ఆంతవరకు యివ్వక పోవటమే ఆలస్యానికి కారణం, అనుకున్న ప్రకారం టి.వి. తీసుకు వచ్చినప్పుడే కోడలిని కాపురానికి తీసుకొని రావటం జరుగుతుందని" మామగారు అప్పుడప్పుడూ బహిరంగంగా అనటం నాన్నకు తెలిసింది. శ్రీవారేమన్నా ప్రత్యేక వ్యక్తిత్వంతో తండ్రినికాదని కార్యదీక్షతో ముందుకు వస్తారా! అంటె వారు పితృవాక్య పరిపాలనలో అపర శ్రీరామ చంద్రమూర్తి.

కాలగతి బాగుండక యెప్పటికప్పుడు

యేవో కుటుంబ ఖర్చులువచ్చి మీద పడుతూయున్నందున టి వి. యివ్వటం జరుగక నా కాపురం సమస్య వినాయకుని పెళ్ళిలా" నా యెదుట పడసాగింది.

## 2

కమలా! బాబు నిద్రపోవటంలేదు, కాస్త డాబామీదికయినా తీసుకుపోయి నిద్రపుచ్చమంటూ నా చేతికిచ్చింది అక్కయ్య. బాబును భుజముపైన పరుండబెట్టుకొని వెన్నెలలో యెంత సేపు త్రిప్పి జోకొట్టినా వాడు నిద్ర పోలేదు. నాకేమో కళ్ళు మూసుకు పోతున్నవి. ఇక యీ విధంగా కాదని ప్రక్కలో వేసుకొని పడుకొన్నాను. వాళ్ళమ్మ అనుకొన్నాడేమో యేకంగా పాలకు తడవట మారంభించాడు. ఆ సాయంత్రం నాచీర బాబు తడపటంతో అక్కయ్య చీర నే కట్టుకోవాల్సి వచ్చింది.

నేనొక అపూర్వమైన ఆనందము ననుభవించాను కడకు స్తనము గుడపటంతో మాతృత్వం ఫలిస్తుంది కాబోలు! నా శరీరమంతా ఝల్లని రోమాంచితమయింది

బాబెపుడు నిద్రపోయాడో నాకు తెలియదు. ఒకరాత్రప్పుడు మెలకువ వచ్చిచూస్తే నేబావ కౌగిలిలో యుండటం గమనించాను. బాబు దూరంగా నిద్రపోతున్నాడు. ఎప్పుడువచ్చి బావ నా ప్రక్కన పడుకున్నాడో నాకు తెలియదు. ఒకవేళ అక్కయ్యచీర కట్టుకొని యుండటంవల్ల నన్నక్కయ్యగా భావించి కౌగిలిలోకి తీసుకొన్నాడేమోలెమ్మని మనస్సుకు సమాధానం చెప్పుకొని. నెమ్మదిగా కౌగిలివిడిపించుకొని గదిలోకి పోయి వేరే మంచముపై పడుకొన్నాను, కాని ఎంతసేపటికి నిద్రపట్టదు. ఆలోచించకుండా యెంత నిగ్రహించుకుందామన్నా మనస్సంతా మధురమైన ఆలోచనలతో నిండి నిద్రరాలేదు.

నన్ను చూచి అక్కయ్యనుకొని బావ భ్రమపడటమొక లెక్కలోనికిరాదు. ఒక్కొక్కప్పుడు అమ్మనాన్నలే మార్మొగమై యున్నప్పుడు అక్కయ్య పేరుతో పిలిచి నే తిరిగి చూడటంతో ఆశ్చర్యపోయేవారు. మా యిద్దరిమధ్య వయసులో నాలుగయిదు సంవత్సరములు తేడాయున్నా నే కొంచెము పొడుగా యుండటంతో మా బంధువులలో కూడా తెలియని వాండ్రు యిద్దరము కవలపిల్లలనుకునేవారు.

తెల్లవారుజామున నిద్రపట్టటంతో బాగా ప్రొద్దుపొడిచినతరువాతగాని మెలకువరాలేదు. ఆలస్యంగా మెలకువవచ్చినందుకు నాపైనాకే విసుగుకలిగింది. బావ మొగము చూడటానికి మనసు ఒప్పలేదు. అప్పటికేలేచి అంట్లుపనిమనిషి కేసి కాఫీకి నీళ్ళుపెట్టాడుబావ. ఆలస్యంగా మెట్లుదిగివస్తున్న నన్ను జూచి అక్కయ్య ఏమే కమలా! ఈ రోజు ఇంతసేపు నిద్రపోయావు మెలకువరాలేదా" అంటూ నవ్వుతూ మాట్లాడింది.

టూత్ పేస్టు నీళ్ళు బావకివ్వబోగా నా వైపు క్రీగంట చూస్తూ "అయితే రాత్రి నువ్వా" అంటూ ఆశ్చర్యం కనబరిచాడు, నాకు చచ్చే సిగ్గయింది. తలవంచుకొని వంటింట్లోకి పరిగెత్తాను, రాత్రి కట్టుకున్న అక్కయ్య చీర అంత వరకు విడువకపోవటంతో ప్రొద్దునే బావకు దొంగను పట్టిచ్చినట్లయింది.

## 3

భోజనానంతరము రాత్రి ఆ ఘటననుగూర్చి ఆలోచిస్తూ పడుకున్నాను. బావ మాటలు అక్కయ్య మందలింపు నా మనసును కలవరపరిచాయి. అయితే బావ నిజంగా నన్ను అక్కయ్యే అనుకున్నాడు? అని యోచిస్తూ గోడతట్టు ముఖమయి పడుకొనియున్నాను.

బావ లోపలికెప్పుడొచ్చాడో తెలియదు. గడియవేసిన చప్పుడయి తల పైకెత్తి చూస్తే లోపల బావ. దిగ్గునలేచి తలుపు తీసుకొని పారిపోవ ప్రయత్నించి వాలికర్థముగా బిగిసిన బావ బాహుబంధంలో చిక్కుబడిపోయాను, చేతులతో తోలకా "వద్దువద్దంటూ" బావకు అడ్డు చెపుతున్నానేగాని, మనస్సు లొంగిపోతున్నాను, "భయమేమీ లేదని" చెపుతూ క్రమంగా నన్నాక్రమించుకోసాగాడు బావ.

అక్కయ్యకు ద్రోహం చేస్తున్నానేమోనన్న ఆలోచన మనస్సంతా నిండి దుఃఖించసాగాను. నా దుఃఖానికి కారణం బావ వేరే విధంగా అర్థం చేసుకున్నాడేమో "ఏమిటంటూ" ప్రేమతో అనునయించసాగాడు.

శరీరము మనస్సు రెండూ నా వశంలో లేవు. నేనేమి చేయుచున్నానో నాకేమీ తెలియటంలేదు. రెండు చేతులతో బావను బంధించి దగ్గరకు లాగుకొని ఏమీ లేదంటూ చిరునవ్వునవ్వాను. బావ తృప్తి చెందాడు, ఆనందమంటే ఇంతకు మించి వేరేవుంటుందా అనిపించసాగింది నాకు.

అక్కయ్య ఇంట్లో లేకపోవటంతో ఆ మూడురోజులు నాది స్వేచ్ఛారాజ్యమయింది. క్రమంగా బావంటే భయం పోయి వాత్సల్యపూర్వకమయిన ప్రేమ కలగసాగిందినాకు. బాబు తండ్రిగా బావను నేను ప్రేమిస్తున్నాను. కాని అక్కయ్య భర్తగా అంతరాంతరంల్లో బావను ద్వేషించకుండా వుండలేకపోతున్నాను ఈ విరుద్ధ ప్రవృత్తులకు అర్థమేమో అప్పుడేకాదు, యిప్పటికీ నాకు తెలియదు.

## 4

ఇంట్లోకి వచ్చిన అక్కయ్య మా ఇద్దరి ప్రవర్తన అనుమానిస్తున్నట్లు గట్టి నిదర్శనముకొరకెదురు చూస్తున్నట్లు పొడగట్టిందినాకు, ప్రకృతినాపై దయతలచలేదు. చేసిన తప్పుకు శిక్షించకుండా వదలలేదు.

ఏదో నలతగా అన్యమనస్కనైఉన్న నన్ను "ఏమిటి సంగతంటూ" ఒకనాడు నిలదీసి ప్రశ్నించింది అక్కయ్య. "ఏమీ లేదంటూ" అప్పటికేదో సాకు చెప్పి తప్పించుకొన్నానన్న మాటేగాని,

నా మనస్సులో యెందుకో భయంభయంగానే యున్నది. ఈ సంగతి బావతో చెప్పటానికి గూడ నాకు యేకాంతము దొరకలేదు. అక్కయ్య చూపులు మమ్మల నెప్పుడూ వెంటాడుచునే యుండెడివి.

పదిరోజుల తరువాత ఒకనాడు నేను అక్కయ్య కూర్చొని భోజనం చేస్తున్నాము. బావ భోజనము చేసి బయటకు పోయినట్లున్నది. నాకు వాంతి చేసుకోవలసిన అవసరమొచ్చి యిక ఆపుకోలేక "బాత్‌రూమ్"లోకి పోయి తిన్న అన్నమంతా డోక్కున్నాను. అక్కయ్య నా వెంటనే లేచి వచ్చి జరిగింది చూచి సంగతంతా గ్రహించింది. "ఇక నైనా నిజమొప్పుకోవేమి కమలా!" అంటూ నన్ను గద్దించింది. నా మనస్సులోని దుఃఖమాపుకోలేకపోయాను. ఎందుకీ ఊరు వస్తినని భగవంతుడాయని దేవుని తలచుకొని యేడ్చాను. చివరకు నేజేసిన తప్పు అక్కయ్య దగ్గర యొప్పుకొనక తప్పలేదు.

"కమలా! ఎంతపని చేసావే! కొంప ముంచావు గదే!" అంటూ ఆక్రోసించింది అక్కయ్య.

## 5

ఆరాత్రి పడకగదిలో అక్కయ్య అడిగే బాకుల్లాంటి ప్రశ్నలకు, అంత ధీరుడయిన బావగూడ భీరుడై జవాబులు చెపుతుంటే నాకు జాలి వేసింది. తను జేసిన తప్పును ఒప్పుకొని యిక చేయవలసిన పని గూర్చి తనకు వదిలి చెప్పి తమ కుటుంబం పరువు ప్రతిష్ఠలు నిలపమంటూ అక్కయ్యను బ్రతిమలాడ సాగాడు బావ.

కొంతసేపు బ్రతిమలాడించుకొని బెట్టుసరి చేసి "వాళ్ళత్తగారు కావాలన్న టెలివిజన్ కొనిచ్చి ముందు దానిని కాపురమునకు పంపి మీ పరువు నిలబెట్టుకొండంటూ పరిష్కార మార్గం సూచించింది అక్కయ్య. బావకేమి చేయుటకు తోచలేదు. కొంచెం సేపు ఆలోచించి యేకో నిర్ణయానికి వచ్చినట్లు తలూపి అక్కయ్యతో గుసగుసలాడాడు. విని మెదలకుండా ఊరుకుంది అక్కయ్య. మౌనమర్ధాంగీకార సూచననుకొన్నాడు బావ.

మరుసటి రోజే తన "ప్రావిడెంట్ ఫండ్"లో నుంచి మూడువేలు అప్పు తీసుకొని సాలిడార్ టివి కొని తీసుకు వచ్చాడు. చెల్లెలు కాపురమేదో విధంగా కుదుట బడుతున్నందుకు తమ పరువు ప్రతిష్ఠలు భగ్నం కానందుకు అక్కయ్య ముఖమొక్కసారి ఆనందంతో కళకళలాడింది. బావకు లాటరీలో బహుమానంగా టివి వచ్చిందని యిది వియ్యాలవారికిచ్చి కమలను అత్తవారింటికిపంపిస్తే తరువాత డబ్బుసంగతి చూచుకోవచ్చని నాన్నకు బావచేత జాబు వ్రాయించింది అక్కయ్య.

జాబు చూచుకొన్న నాన్న అల్లుని ఔదార్యానికెంతో మెచ్చుకొన్నాట్ట. నేను "వాళ్ళకు పెట్టాల్సింది పోయి వాళ్ళ సొమ్ము తీసుకోవలసి వచ్చింది గదాయని

గూడా నొచ్చుకున్నాడని" అమ్మ చెప్పింది నాకు. శ్రీ టాజులా అల్లుని అదేపనిగా పొగడుతున్న నాన్న అమాయకత్వానికి నాలో నేనే నవ్వుకొన్నాను.

నన్ను తీసుకొని పోవుటకు నాన్నే స్వయంగా వచ్చాడు. ఏ సుజావన ఉన్నదో పొయ్యేముందు నే బావ దగ్గర సెలవు తీసుకొనేందుకు అవకాశం గల్పించింది అక్కయ్య. తన కాపురానికి నే చేసిన ద్రోహం యింత త్వరగా మరచి పోతుందని కలలో గూడ అనుకోలేను.

బావ నన్ను కౌగిట్లోకి తీసుకొని "మరచిపోవుగదా కమలా!" అంటూ ముద్దుకున్నాడు. నేను మరచిపోయినా నా కడుపులోని మీ ప్రతిబింబం మరచి పోనిస్తుందా" అనుకొని విడువలేక విడువలేక బావ కౌగిలి విడిపించుకొని బయటికి వచ్చాను.

అక్కయ్య యిచ్చిన పసుపుకుంకుమ అందుకొని కన్నీళ్ళతో పాదాభివందనము చేసిన నన్ను లేవదీసి, కౌగిట్లోకి తీసుకొని, "ఛీ! పిచ్చిపిల్లా అంతా సుఖంగా! మన్నించిన... వంశోద్ధారకుని గాని ... అనుభవం ... "సహాస్యం శ్రద్ధంగా కాపాడు సుమా!" అంటూ హెచ్చరించి వదిలింది.

"నీ మాతృమనసే గదా యిదంతా" అని మనసులో అనుకొని బాబునెత్తి ముద్దు పెట్టుకొని అక్కయ్యకిచ్చి బండి యెక్కాను.

నెలరోజులు గడవక ముందే కాపురమునకు బోయాను. తమ స్వంతం నెగ్గినందుకు మా అత్తమామలు సంతోషించారు. శ్రీవారి మనసెటు ప్రవహించెడు తున్నదో తెలియలేదు. మొత్తానికంతా ప్రేమగానే చూచేవారు నన్ను.

మావాళ్ళు టెలివిజన్ పెట్టిపంపుతలాట్లాడు అని సంతోషించేది.

"ఊళ్ళో నలుగురికి మా కోడలుకు పుట్టింటివారు టెలివిజన్ కొని ఇచ్చారంటూ" అప్పుడే గొప్ప ప్రచారం చేసింది మా అత్తగారు.

కార్యమయిన ఎనిమిది నెలలకే పండంటి బాబును గని. పురిటి గదిలో పడుకొనియున్న నాకు "ఎనిమిదో నెలలో ప్రసవమయినా పిల్లవాడు పుష్టిగానే యున్నాడు తల్లి శరీరపు తీరు" అన్న అత్తగారి మాటలు కర్ణపేయంగా విని పించాయి.

వంశోద్ధారకుడు కలిగాడంటూ బాబు నామకరణ మహోత్సవానికి తెగ ఆర్భాటం చేస్తున్న మామగారి చేతలు నవ్వు తెప్పించాయి నాకు.

లోకమేమనుకున్నా నాకు నా బాబు, నా బాబుకు నేనంటూ పొత్తిళ్ళలో పసికందును హృదయానికి హత్తుకొన్నాను. పొరపాటు బాబును అమాంతం తడిపేసింది. ★

